క్లుప్తంగా

పోచమ్మతల్లికి వెండి కిరీటం సమర్పణ



కిరీటం అందజేసి పూజలు చేస్తున్న దాతలు

కొత్తగూడెంటౌన్/సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం పట్టణ పరిధిలోని బాబుక్యాంప్‌లోని పోచమ్మతల్లి అమ్మవారికి బాబుక్యాంపునకు చెందిన రాజలపూడి సాంబమూర్తి ఆదివారం రూ.60 వేల విలువైన వెండి కిరీటాన్ని సమర్పించారు. సింగరేణి సంస్థలో కొత్తగూడెం ఏరియా స్టోర్స్‌లో ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజలపూడి సాంబమూర్తి గతంలో పాల్వంచలోని పెద్దమ్మతల్లి ఆలయానికి సైతం కిరీటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజలపూడి సుభారాణి, శ్రీహిత, నాగసాయి ప్రాద్యుత, బేబి సరోజ, నాగేంద్ర, శ్యామల, శ్రీనిజి సాయి, సూర్యప్రకాష్, కూసన నరేందర్, వేముల నరేష్, చీకట్ల చంద్రయ్య, సదమోహన్, కమల్ గుండు, మల్లికార్జున్ తాతి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

పాల్వంచరూరల్: మండలపరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి చంద్రుగొండకు చెందిన నిమ్మటూరి కృష్ణ, పూర్ణ దంపతులు రూ.8,601 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. విరాళాలు అందజేసిన భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

మైనారిటీ స్టేటస్ సర్టిఫికెట్ తప్పనిసరి

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 21న ప్రారంభం కానున్న నీట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు మైనారిటీ స్టేటస్ సర్టిఫికెట్ తప్పకుండా సమర్పించాల్సి ఉంటుందని, దీని కోసం స్థానిక మీ–సేవ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను రెవెన్యూ శాఖ విడుదల చేసిన దరఖాస్తు ఫారంతో పాటు కుల సర్టిఫికేట్, 10వ తరగతి టీసీ, ఆధార్‌కార్డు లేదా రేషన్ కార్డు, నీట్ ర్యాంక్ కార్డుతో ఈ–సేవ సెంటర్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంజీవ్‌నాయక్‌ను కలిసిన నాయకులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సేవాలాల్ సేన వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ నాయకులు సంజీవ్ నాయక్‌ను సూర్యాపేటలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యాచరణపై చర్చించారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా కేసీఆర్ గద్దెనెక్కటం ఖాయమని, ఇల్లెందులో బీఆర్ఎస్ గెలుపొందటం కూడా ఖాయమన్నారు. లలిత్‌కుమార్ పాసీ, చీమల సత్యనారాయణ, వసంత్, రాజేష్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

నేడు సీపీఐ మండల మహాసభ

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియాలో సోమవారం నిర్వహించే సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పార్టీ 21పిట్ శాఖ ఆదివారం ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా శాఖ కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ, నాయకులు మంచాల వెంకటేశ్వర్లు, గుగులోత్ కృష్ణ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ ముందు వరుసలో ఉద్యమాలు నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వద్ల శ్రీనివాస్, యాదగిరి, భాస్కర్, మోజెస్, రెంటాల సదా, కొమరయ్య, వీరయ్య, రవి, రాములు, కాశీం, తాండ్ర లక్ష్మీనారాయణ, బాసిపాక రవి, ఇమ్రాన్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన పెద్దమ్మగుడి మాజీ చైర్మన్ గంగిరెడ్డి సుందర్‌రెడ్డి సోదరుడు వెంకట్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా పలువురు నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగిరెడ్డి సుందర్‌రెడ్డి, డాక్టర్ గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు, మండల అధ్యక్షుడు పూసల విశ్వనాథం, డిష్ నాయుడు తదితరులు ఉన్నారు.

వంతెన కష్టాలు తీరేదెన్నడు?

పాతతండా–రాంపురం మధ్య రాళ్లవాగు వంతెన కోసం ఎదురుచూపులు

- వరదొస్తే రాకపోకలు బంద్
- దశాబ్దాలుగా ఇబ్బందిపడుతున్న ప్రజలు



పాతతండా - రాంపురం మధ్య రాళ్లవాగు చప్టా..



వరద ఉధృతికి ఆగిపోయిన రాకపోకలు (ఫైల్)

టేకులపల్లి: మండలంలోని పాతతండా–రాంపురం మధ్య రాళ్లవాగు వంతెన కోసం ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. ఇక్కడ నిర్మించిన చప్టా వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. వరదొస్తే చాలు ఈ చప్టా మీది నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతుండటం నిత్యకృత్యంగా మారింది. ఏదైనా అత్యవసర సమయంలో అయితే ఇక అంతే సంగతులు. ఇప్పటికే పలువురు వరద ఉధృతికి ప్రాణాపాయం నుంచి బయటపడిన ఘటనలు సైతం ఉన్నాయి. టేకులపల్లి, కొత్తతండా(పీ), దుబ్బతండా, పాతతండా, హరిజనచెర్రితో పాటు రాంపురం గ్రామస్తులకు చెందిన సుమారు 3,500 ఎకరాల భూములు రాంపురం అవతల సుజాతనగర్ మండలం సింగభూపాలెం పరిధిలో ఉన్నాయి. ప్రతీ సీజన్‌లో రైతులు సాగు పనుల నిమిత్తం ఈ చప్టా దాటి వెళ్లాల్సి ఉంటుంది. కానీ వర్షాకాలంలో వరదొస్తే ఈ వాగు దాటడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. గతేడాది సెప్టెంబర్ 8న రాంపురం గ్రామానికి చెందిన ఆబోతు వాగు దాటబోయి వరద ఉధృతిలో కొట్టుకుపోయింది. సకాలంలో గుర్తించిన గ్రామస్తులు దాన్ని కాపాడారు. గతంలో కోరం కనకయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే పాతతండా నుంచి రాంపురం వరకు బీటీ రోడ్డు వేశారు. హై లెవెల్ బ్రిడ్జి మాత్రం మంజూరు కాలేదు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రాబోయే రోజుల్లో ప్రాణనష్టం వాటిల్లకుండా పాతతండా–రాంపురం మధ్య రాళ్ల వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పనులకు ఇబ్బందిగా ఉంది



మా భూములు రాంపురం అవతల సుజాతనగర్ మండలం సింగభూపాలెం పరిధిలో ఉన్నాయి. వానాకాలంలో వ్యవసాయ పనులకు వెళ్లాలంటే భయంగా ఉంది. వరద ఉధృతి వల్ల వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికే చాలా మంది ప్రాణాపాయం నుంచి బయటపడిన ఘటనలు ఉన్నాయి. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలి

– బాణోతు బన్సిలాల్, పాతతండా

హైలెవెల్ వంతెన నిర్మించాలి..



పాతతండా–రాంపురం మధ్య రాళ్లవాగుపై నిర్మించిన చప్టా వల్ల ఉపయోగం ఉండటం లేదు. వరదొస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వానాకాలంలో వరద సమయంలో ఏమైనా మెడికల్ ఎమర్జన్సీ వస్తే అంతే సంగతులు. అధికారులకు, పాలకులు స్పందించి హైలెవెల్ బ్రిడ్జి మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయించాలి.

– గుగులోత్ రవీందర్, రాంపురం

రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: రోటరీక్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో 40వ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షుడిగా జక్కుల రవికుమార్‌తో పాటుగా సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కొత్తూరు సంజీవరావు హాజరై మాట్లాడుతూ... రోటరీ క్లబ్ సేవలు అభినందనయమని కొనియాడారు. కొత్తగూడెం రోటరీక్లబ్ అగ్రస్థానాల్లో ఉందని, కృత్రిమ పాదాలు అందించడం వంటి సేవ చేస్తున్నారని, రాబోయే కాలంలో మరింత సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ పి.శ్రీమహాలక్ష్మి, సెక్రటరీ శ్రీరామనేని చలపతిరావు, పీడీజీ అబ్రహం, క్లబ్ ట్రైనర్ ఆనంద్ కుమార్, అడ్వైజర్ అంకం పాపయ్య, సిరిమల్ల సత్యనారాయణ, డాక్టర్ ప్రసన్నకుమార్, మాజీ అధ్యక్ష కార్యదర్శులు సుజాత, దుర్గారాణి పాల్గొన్నారు.

నేడు ఇల్లెందులో ఆధార్ క్యాంపు

ఇల్లెందు: మున్సిపాలిటీలో మూడు రోజుల పాటు ఆధార్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సోమవారం ప్రారంభమై ఈనెల 16 వరకు ఆధార్ క్యాంపు కొనసాగుతుందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంపులో ఇల్లెందు టౌన్, మండలం, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి మండలాలకు చెందిన వారికి అవకాశం ఉంటుందన్నారు. ఐదేళ్లలోపు కొత్త వారికి మీ సేవా కేంద్రం నుంచి బర్త్‌డే సర్టిఫికేట్‌లతో ఇతరులు టెన్త్ మెమో, అడ్రస్ మార్పు కోసం వివాహ రిజిస్ట్రేషన్, నివాస ధ్రువీకరణ పత్రం అందజేయాలని కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: అమరవీరుల ఆశయ సాధన కోసం ఉద్యమిద్దామని అందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారి పిలుపునిచ్చారు. ఈ నెల 16న ఇల్లెందులో రాయల చంద్రశేఖర్ స్థూపావిష్కరణ, ప్రథమ వర్ధంతి సందర్భంగా ముద్రించిన పోస్టర్లను ఆదివారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. సుందర్, పంతులు, జగియ, ఏనుటి నాగయ్య, మదార్, లింగ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల హామీ నెరవేర్చాలి



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి వెంటనే నెరవేర్చాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన అసెంబ్లీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకంగా కొనసాగిందని, అధికారంలోకి వస్తే స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకూ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చెనిగరపు నిరంజన్ కుమార్, అల్లకొండ శరత్, వినయ్, పూణెం మురళి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢ బోనాలు



ఇల్లెందు: చెరువు కట్ట పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద..



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: ఆషాఢ మాసం సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తారు. ఆదివారం పట్టణంలోని చెరువు కట్ట పెద్దమ్మ తల్లి, కాళీమాత టెంపుల్ వద్ద ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగాల రాజేందర్, మాజీ కౌన్సిలర్ కటకం పద్మావతీ పాల్గొని పూజలు నిర్వహించారు.

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియా మహిళలు బోనాల మహోత్సవాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామంలోని మహిళలంతా ప్రదర్శనగా పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకుని నైవేద్యంగా బోనం చెల్లించుకున్నారు.

జూలూరుపాడు: మండలంలోని శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాల పండుగను అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో బాణాసంచా కాలుస్తూ నృత్యాలు చేస్తూ ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలతో పూజలు నిర్వహించి బోనాన్ని సమర్పించారు. పూజారులు నేరేళ్లకుంట శ్రీనివాస్‌రావు, జంధ్యాల నాగ ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. యల్లంకి సత్యనారాయణ దంపతులు, నున్నా రంగారావు, వెంకటేశ్వర్లు, తాళ్లూరి లక్ష్మయ్య, రవి, అనుమల్ల అశోక్, పుల్లారావు, కందిమళ్ల వెంకటయ్య, నాగార్జున్‌రావు, పెంటికల వీరబాబు, రామారావు తదితరులు ఉన్నారు. అదేవిధంగా మండలంలోని రామచంద్రాపురంలో శ్రీ కోటమైసమ్మతల్లి, శ్రీపెద్దమ్మ తల్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. మాజీ వైస్ ఎంపీపీ కొడెం సీతాకుమారి, గ్రామపెద్దలు మల్కం రాములు, ముక్తి గాంధీ, కొడెం శ్రీను, గుర్రం మల్లయ్య, పూజారి ఈసం సాములు ఉన్నారు.



ఇల్లెందురూరల్: బోనాలతో మహిళలు..





జూలూరుపాడు: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కోటి కుంకుమార్చనలో ఎమ్మెల్యే పాయం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయం

పాల్వంచ: స్థానిక శ్రీ భువనేశ్వరీ సహిత ఆత్మలింగేశ్వరాలయంలో జరుగుతున్న కోటి కుంకుమార్చన మహాయజ్ఞం పూజలను ఆదివారం వైభవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానాచార్యులు సర్వదేవర భట్ల జితేంద్ర శర్మ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు సందుపట్ల శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ మచ్చా శ్రీనివాసరావు, మచ్చా నాగార్జున, సాంబయ్య పాల్గొన్నారు.

దాడులు అప్రజాస్వామికం..



నిరసన తెలుపుతున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైదరాబాద్‌లో నవచేతన విజ్ఞాన కేంద్రంలో ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఏఐఎస్ఎఫ్ జాతీయ శిక్షణ తరగతుల సందర్భంగా అమెరికా మారణఖాండను ఆపాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపడితే బీజేపీ, బీజెవైఎం దాడిచేయడం అప్రజాస్వామికమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వి.అజిత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కొత్తగూడెం పట్టణంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. దాడి చేసిన వారినిఅరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శ వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు సంజయ్, నాయకులు నవీన్, ప్రవీణ్, సంతోష్ అవినాష్, వెంకటేష్, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తర్వాత సేవ చేయాలి



వీరనారాయణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం సమాజసేవకు పునరంకితం కావాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలో పెద్దమ్మగుడి సముదాయంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆదివారం కేటీపీఎస్‌లో గ్రేడ్–1 ఫోర్‌మెన్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన మల్లేల వీరనారాయణను సత్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొండం వెంకన్న, నాయకులు, రాము, శాంతివర్ధన్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో హాజరైన పూర్వ విద్యార్థులు

ఇల్లెందు: పట్టణంలోని 14 నంబర్ బస్తీ మోహల్లా నంబర్–16 స్కూల్‌లో 1982–83 విద్యాసంవత్సరం 7వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారు 43 ఏళ్ల తర్వాత కలుసుకుని అప్పటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

జూలూరుపాడు: హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ విమర్శించారు. ఆదివారం మండలంలోని పలు ప్రభుత్వ హాస్టళ్లను ఏఐఎస్ఎఫ్ నాయకుల బృందం సందర్శించి, విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పడమటనర్సాపురం ఏజీహెచ్ఎస్, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో వెనక గుట్టలు ఉండటంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఆటస్థలాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. రామ్‌చరణ్, సాయితేజ, గణేష్, సాయి ధనుష్, విద్యార్థినులు పాల్గొన్నారు..

అభివృద్ధికి నిరంతరం కృషి

కొత్తగూడెంఅర్బన్: మాల జాతి సంక్షేమం, అభివృద్ధికి జాతీయ అధ్యక్షులు చెన్నయ్య నిరంతరం కృషి చేస్తున్నారని ఆచార్య, డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం చెన్నయ్యను హైదరబాద్‌లో కలిసి సన్మానించారు. ఆదర్శ ఫౌండేషన్ అధ్యక్షుడు కుసుమ భోగరాజు, కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, అడ్వకేట్ చింతమల్ల సాయిబాబా, కైలాస్, తిరుపతి, శంకర్ ఉన్నారు.

గెలుపే ధ్యేయం..

జూలూరుపాడు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని భేతాళపాడు గ్రామంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు అన్నవరపు సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, ఉపాధ్యక్షుడు ధరావత్ బాలకిషన్, రాంబాబు, భూక్యా రవి, భూక్యా చరణ్, బాబులాల్ ఉన్నారు.

సీపీఐ పట్టణ కమిటీ ఎన్నిక



సాయిబాబా, రాహుల్

పాల్వంచ: సీపీఐ పాల్వంచ పట్టణ కార్యదర్శిగా అడుప మల్లి సాయిబాబా, సహాయ కార్యదర్శిగా ఉప్పుశెట్టి రాహుల్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం లారీ అసోసియేషన్ హాల్‌లో జరిగిన 19వ పట్టణ మహాసభలో కమిటీని ఎన్నుకుని ఆదివారం వెల్లడించారు. అదేవిధంగా 21 మంది కార్యవర్గ సభ్యులు, 91 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తామన్నారు.

బెంబేలెత్తిస్తున్న శునకాలు

- మండల వ్యాప్తంగా స్వైరవిహారం
- మూడేళ్లలో 722 మంది బాధితులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మండలకేంద్రంలో సంచరిస్తున్న కుక్కలు

సుజాతనగర్: మండలవ్యాప్తంగా శునకాల సంచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆయా గ్రామాల్లోని వందలాది కుక్కలు స్వైరవిహారం చేస్తూ పశువులు, మనుషులపై దాడి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో జనంపై ఎగబడుతూ ప్రాణాపాయ స్థితిని సృష్టిస్తున్నాయి. వీటి ఆగడాలతో ద్విచక్ర వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం సుజాతనగర్‌తో పాటు, పలు పంచాయతీల్లో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. చిన్నపిల్లలను అదును చూసి వెంటాడుతున్నాయి. చిన్నారులు చేతుల్లోని ఆహార పదార్థాలు లాగేసుకుంటున్నాయి. శునకాల దాడితో బాధితులు టీకాల కోసం ప్రభుత్వాస్పత్రుల వద్దకు పరుగెడుతున్నారు. సుజాతనగర్ ప్రభుత్వాస్పత్రి పరిధిలో గడిచిన మూడేళ్లలో 722 మంది కుక్కకాటుకు గురయ్యారంటే పరిస్థితికి దర్పణం పడుతోంది. 2021లో 331 మంది, 2022లో 317 మంది, 2023లో 74 మంది కుక్కకాటుకు గురైనట్లు వైద్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

జంతు వ్యర్థాల రుచి మరిగి..

గ్రామీణ ప్రాంతాల్లో మాంస వ్యర్థాలు ఊరి బయట పడేస్తున్నారు. వీటి రుచి మరిగిన కుక్కలు మనుషులు, పశువులు, పెంపుడు కోళ్లను వేటాడుతున్నాయి. చీకట్లో వెళ్లే పాదచారులు, ద్విచక్రవాహనదారులను సైతం వదలడం లేదు. కొన్ని చోట్ల ద్విచక్ర వాహనాలకు కుక్కలు అడ్డు తగులడంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోయిన ఘటనలు ఉన్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైన చోట వీటి సంఖ్య అధికంగా ఉంటోంది.

పట్టించుకోని యంత్రాంగం..

గ్రామాల్లో కుక్కల సంచారం పెరగడంతో ఏళ్ల తరబడి వీటిని అరికట్టేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రజలకు ప్రాణాపాయంగా మారిన కుక్కలను పట్టించి అడవుల్లోకి తీసుకెళ్లి వదిలేయడం లేదు. ఒకటి రెండు చోట్ల పట్టించినా వాటిని తిరిగి పక్క ఊరిలో వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్న దాఖలాలు లేవు. కొన్నిచోట్ల ఆర్థిక ఇబ్బందుల దష్ట్యా సర్పంచులు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపించేందుకు ఆసక్తి చూపడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే సాధారణ విషయంగా పరిగణించి దాటవేస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు.

భయపడక తప్పడం లేదు



గుంపులుగా కుక్కలు తిరుగుతుండటంతో భయపడాల్సి వస్తోంది. రాత్రి పూట బయటకు రావాలంటేనే వణుకు పుడుతోంది. పాఠశాలలకు వెళ్లే పిల్లలు భయంగా వెళ్తున్నారు.

– గూని శ్రీనివాసరావు, సుజాతనగర్

కుక్కలను నియంత్రించాలి



మండలంలో వీధి కుక్కలు చాలా సంఖ్యలో సంచరిస్తున్నాయి. వాటిని చూస్తే ప్రజలు జంకుతున్నారు. పిల్లలు, పెద్దలు భయపడాల్సి వస్తోంది. తక్షణమే వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– బాదావత్ రాంకుమార్, సీతంపేట బంజర